

స్థానికుల దర్శనానికి నేడు టోకెన్ల జారీ

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి స్థానికుల దర్శనానికి సంబంధించి సోమవారం తెల్లవారుజాము 3 నుంచి 5 గంటల మధ్య ముందు వచ్చిన వారికి తొలి ప్రాధాన్యతతో టోకెన్లు జారీ చేయనున్నారు. గతంలో ప్రతినెలా మొదటి మంగళవారం ఉన్న స్థానికుల దర్శనాన్ని తిరిగి ప్రారంభించాలని ఇటీవల టీటీడీ ధర్మకర్తల మండలి తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన స్థానికులకు ఉచిత దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తిరుమలలో 500, తిరుపతిలో 2,500 టోకెన్లు జారీ చేయనుంది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమల స్థానికులకు తిరుమల బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్, తిరుపతి మహతి ఆడిటోరియంలో టోకెన్లు జారీ చేస్తారు. ఒరిజనల్ ఆధార్ ఉంటేనే ఇస్తారు. టోకెన్లు పొందిన వారు మంగళవారం ఒరిజనల్ ఆధార్ కార్డుతో తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని పుట్‌పాత్ హాల్ (దివ్యదర్శనం) క్యూలోకి ప్రవేశించాలి. ఈ కోటాలో ఒకసారి టోకెన్ పొందితే 90 రోజుల(3 నెలలు) వరకు అవకాశం ఉండదు.

నేడు సూళ్లూరుపేటలో పీజీఆర్ఎస్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో సూళ్లూరుపేట సత్యసాయి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ యథావిధిగా కొనసాగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

ముంచెత్తిన ఫెంగల్

నీట మునిగిన 3,800 హెక్టార్ల పంటలు
నేలకొరిగిన 35 విద్యుత్ స్తంభాలు
తిరుమల ఘాట్‌లో విరిగిపడ్డ కొండ చరియలు
కాళంగి, అరణియార్, మల్లెమడుగు గేట్లు ఎత్తివేత
మూడు చెరువులకు గండ్లు
పోటెత్తిన జలపాతాలు
సూళ్లూరుపేట, తడ, శ్రీకాళహస్తి, డీవీసత్రం, నాయుడుపేట మండలాలపై తీవ్ర ప్రభావం

స్వర్ణముఖి నది పరవళ్లు



కపిలతీర్థం జలపాతంలో నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చిన పాము



పుత్తూరు మండలంలో పొంగిపొర్లుతున్న నేసనూరు కలుజు



పుత్తూరు మండలం పిల్లారిపట్టు కాజువే మీదుగా పరవళ్లు తొక్కుతున్న అరుణానది

తిరుపతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ జిల్లాను ముంచెత్తుతోంది. రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జలపాతాలు హోరెత్తుతున్నాయి. 3,800 హెక్టార్లలో వరి, వేరుశనగ, మినుము పంటలు నీటమునిగాయి. వంద ఎకరాలకు పైగా ఉద్యాన పంటల్లో నీరు చేరాయి. ఈదురుగాలులకు 35 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. తుఫాన్ వల్ల దాదాపు రూ.50 లక్షల వరకు నష్టం జరిగిందని విద్యుత్ శాఖ అంచనా వేసింది. వరదనీరు పోటెత్తడంతో కాళంగి, అరణియార్, మల్లెమడుగు గేట్లు ఎత్తివేశారు. పెళ్లకూరు మండలం కొత్తూరు కొర్రపాటి చెరువుకు గండిపడింది. జిల్లాలో పెద్దచెరువైన చెంబేడు చెరువు కట్ట కుంగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్వర్ణముఖి జలకళతో ఉట్టిపడుతోంది. ఆగకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరమ్మతుల కోసం రూ.45 లక్షలు అవసరమని ఆర్అండ్‌బీ అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుపతిలోని కపిల తీర్థం, మాల్వాడిగుండం జలపాతాలు హోరెత్తుతున్నాయి. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో జనజీవనం స్తంభించింది. చలికి జనం ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. గూడూరు ఆదిశంకర కళాశాల సమీపంలో పంబలేరు చట్టాపై వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. వాకాడు మండలం స్వర్ణముఖి బ్యారేజీకి వరద పెరగడంతో 8 గేట్లు ఎత్తివేశారు. దీనివల్ల రాకపోకలకు ఇబ్బంది కలిగింది.



తిరుమల ఘాట్‌లో రాళ్ల తొలగింపు

● తిరుపతి, తిరుమలపై తీవ్ర ప్రభావం

తుఫాన్ ఈదురు గాలులకు ఆర్టీసీ బస్టాండు ఎదురుగా వంద అడుగుల ఎత్తులో ఉన్న జాతీయ పతాకం పేలికల్లా చిరిగిపోయింది. ఆదివారం ఉదయం గమనించిన అధికారులు దాన్ని తొలగించారు. తిరుమలలో రెండో రోజూ ఎడతెరపిలేని వర్షంతో రెండవ ఘాట్ రోడ్డులో కొండ చెరియలు విరిగిపడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రొక్లెయిన్లతో బండరాళ్లను ఎప్పటికప్పుడు తొలిగించారు. పాపవినాశనం రోడ్డు చెట్ల కొమ్మలు విరిగిపడి అస్తవ్యస్తంగా మారింది. కపిల తీర్థం నుంచి ప్రవహించే వర్షపునీరు మాల్వాడి గుండం కాలువ మీదుగా పొంగి ఉధృతంగా ప్రవహించింది.

● గేట్లు ఎత్తివేత

తిరుమలలో గోగర్భం, ఆకాశ గంగ, పాపవినాశనం డ్యాములు జలకళను సంతరించుకున్నాయి. నీటి మట్టం పెరగడంతో గోగర్భం డ్యామ్‌లో అధికారులు ఓ గేటును ఎత్తివేయాల్సి వచ్చింది. సూళ్లూరుపేట కాళంగి నదికి భారీగా వరదనీరు చేరింది. చంద్రగిరి నుంచి శ్రీకాళహస్తి మీదుగా నాయుడుపేట వైపు వెళ్లే స్వర్ణముఖి పరవళ్లు తొక్కింది. తడ మండలంలో చెరువులు నిండు కుండను తలపించాయి. పాముల కాలువ, కరిపేటి కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెళ్లకూరు మండలం కొత్తూరు కొర్రపాటి చెరువుకు గండిపడింది. రేణిగుంట మండలం మల్లిమడుగు డ్యామ్‌లోకి పెద్దఎత్తున వరదనీరు చేరింది. 5,350 క్యూసెక్కులకు చేరడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు 14 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 5,350 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 5,550గా ఉంది. పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన కొట్టుకుపోవడంతో కాళంగి ఏరు ఉధృతంగా పారుతోంది. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యామ్‌లోకి ఏడు అడుగుల నీటిమట్టం పెరిగింది. మూడు రోజుల క్రితం 841 అడుగుల నీటి మట్టం ఉండగా సాయంత్రానికి 847 అడుగులకు పెరిగిందని అధికారులు తెలిపారు. శేషాచలం అడవుల నుంచి డ్యామ్‌లోకి వరద నీరు వస్తోంది.



నాయుడుపేట మండలం మేనకూరు వద్ద నీట మునిగిన పంట పొలాలు

● నేడు కూడా వర్షాలు

ఫెంగల్ తుఫాన్ తీరం దాటినప్పటికీ దాని ప్రభావంతో సోమవారం కూడా జిల్లాలో ఓ మోస్తరు వర్షపాతం నమోదు కానున్నట్టు వాతావరణ శాఖ చెబుతోంది. అత్యధికంగా వడమాలపేటలో 51.8 మి.మీ, అత్యల్పంగా దొరవారిసత్రం 3.8మి.మీ వర్షపాతం నమోదైంది. కేవీబీపురం 42.4, నాగలాపురం 39.8, తడ 28.4, వరయ్యపాళెం 28.2, వెంకటగిరి 27.8, రామచంద్రాపురం 27.2, పుత్తూరు 24.2, చిన్నగొట్టిగల్లు 22.8, పాకాల 21.2, నారాయణవనం 20.2 మి.మీ చొప్పున వర్షాలు పడ్డాయి. జిల్లాలో సగటు వర్షపాతం 18.6మి.మీగా నమోదైంది.

● పంట నష్టం... రైతు కష్టం

తుఫాన్ ప్రభావం తూర్పు మండలాలపై తీవ్రంగా కనిపించింది. గూడూరు, చిట్టమూరు, కోట, నాయుడుపేట మండలం మేనకూరు ప్రాంతాల్లో వర్షాలకు వరిపైరు నీట మునిగింది. ఖరీఫ్ సీజన్లో తుఫాన్‌కు ముందు వరి నాటిన రైతులు లబోదిబోమంటున్నారు. కేవీబీపురం మండలం జయలక్ష్మీపురంలోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గూడూరు మండలం చెన్నూరు రామలింగయ్య కాలనీలోకి వరదనీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. టీడీపీ నాయకుల చొరవతో వరదనీటి నుంచి వారికి ఉపశమనం కలిగింది.



చిల్లకూరు మండలం వరగలిక్రాస్ రోడ్డు సమీపంలోని వైఎస్సార్ కాలనీలోకి చేరిన వర్షపు నీరు



నిండుకుండలా గోగర్భం డ్యాం

తిరుమలలో నిండుతున్న జలాశయాలు

గోగర్భం డ్యాం గేట్లు ఎత్తివేత

200 రోజుల వరకు నీటికి దిగుల్లేదు

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై జలాశయాలు నిండుతున్నాయి. తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఐదు డ్యాములు జలకళను సంతరించుకున్నాయి. తిరుమల అడవుల నుంచి నీరు జోరుగా ప్రవహిస్తుండటంతో డ్యాములన్నీ నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ప్రస్తుత నీటి నిల్వలతో 200 రోజుల వరకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు సమకూరింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గోగర్భం డ్యాం నిండిపోవడంతో ఓ గేటు ఎత్తివేశారు. ఇక ఆకాశగంగ మినహా మిగిలిన డ్యాములు కూడా ఆదివారం అర్ధరాత్రికి పూర్తి స్థాయిలో నిండే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుమలలో నీటి సమస్య ఏర్పడుతుందని రెండు నెలల క్రితం కంగారుపడిన అధికారులు డ్యాములన్నీ నిండుతుండటంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు...

డ్యాములు	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240(లక్షలగ్యాలన్లు)	4,345
కుమారధార	4,25	2,372
పసుపుధార	1,287	950
గోగర్భం	2,833	2,833
ఆకాశగంగ	685	306

పంట పొలాల్లో వింత చేప



వరదయ్యపాళెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం గ్రామానికి వెళ్లే దారి పక్కనే పొలాల్లో విచిత్ర చేప రైతుకు చిక్కింది. ముళ్లతో నిండి ప్రత్యేక ఆకృతిలో ఉన్న ఈ చేపను స్థానికులు వింతగా చూస్తున్నారు.

శ్మశానానికి వెళ్లాలంటే ఏరు దాటాల్సిందే!




ఏటిలో శవాన్ని మోసుకెళుతున్న పుట్టావాండ్లపల్లె దళితులు

ఎర్రావారిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీ పుట్టావాండ్లపల్లెకు చెందిన దళితులు అంత్యక్రియలకు అవస్థలు పడాల్సి వస్తోంది. గ్రామానికి ఉత్తరం వైపున గాజులేరు అవతల శ్మశానం ఉంది. ఏటికి కల్వర్టు లేకపోవడంతో దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామానికి చెందిన చిన్నస్వామి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నడుము లోతు నీటిలో శవాన్ని మోసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఏటిపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉధృతంగా తలకోన జలపాతం

వారం రోజులు పర్యాటకులకు నో ఎంట్రీ

ఎర్రావారిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శేషాచలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. అడవుల్లోని వాగులు, వంకల నుంచి నీరు భారీగా వస్తుండడంతో జలపాతం సముద్ర మట్టానికి 750 అడుగుల నుంచి జాలువారుతోంది. ముందు జాగ్రత్త చర్యగా పర్యాటకులను వారం రోజుల పాటు నిషేధించినట్లు చామల ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకట్రమణ తెలిపారు.



హిజ్రాల్లో ఆధిపత్య పోరు

పాతకక్షల నేపథ్యంలోనే హాసిని హత్య ● 12మంది నిందితుల అరెస్టు ● పరారీలో ప్రధాన నిందితుడు, మరో ఇద్దరు ● తెరవెనుక సూత్రధారి అలేఖ్య

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హాసిని... ఈమె ఓ ట్రాన్స్‌జెండర్.. అనతికాలంలోనే రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని ట్రాన్స్‌జెండర్లకు నాయకురాలిగా ఎదిగింది.. ఆమె ఉంటే తాము ఎదగలేమని మరికొందరు ట్రాన్స్‌జెం డర్లు భావించారు.. హాసినీని ఎలాగైనా అంతమొందించాలని పగబట్టారు.. ఆమెతో వైరమున్న మరికొందరితో చేతులు కలిపారు. అందరూ కలిసి కిరాయి హంతకులతో రూ.20 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారు. కొంత నగదు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఆ హంతక ముఠా పక్కా స్కెచ్‌తో హాసినీని కత్తులతో విచక్షణగా రహితంగా పొడిచి హత్య చేసింది. ఇటీవల జరిగిన ఈ కేసును పోలీసులు ఛేదించారు. సుపారీ ఇచ్చిన ట్రాన్స్‌జెండర్ నాయకురాలు అలేఖ్య, మరో హిజ్రాతో పాటు 10 మంది నిందితులను అరెస్టు చేశారు. కాగా, ఈ కేసులో 15మందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. అతను చిక్కితే ఈ కేసులో అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి.



హాసిని(ఫైల్‌ఫొటో)

● కుగ్రామం నుంచి అంతర్రాష్ట్ర స్థాయికి..

నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరుకు చెందిన మానికల హాసిని గ్రామస్థాయి నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ హిజ్రాలకు నాయకురాలిగా ఎదిగింది. అది చూసి ఓర్వలేక ఆమె బతికి ఉంటే తమ మనుగడ ప్రశ్నార్థకమని మాజీ నాయకురాళ్లు భావించారు. పక్కా స్కెచ్ వేసి అంతమొందించారు.

● రూ.20 లక్షల సుపారీ

నెల్లూరు నగరానికి చెందిన పాత నేరస్థుడు భూపతి, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన ఓ రౌడీషీటర్ ద్వారా దొరతోపు కాలనీకి చెందిన వంశీకృష్ణ, అల్లీపురానికి చెందిన కార్తీక్, నాలుగో మైలుకు చెందిన సుబ్రహ్మణ్యం, మస్తాన్ వలీ, వెంకటాద్రి, ఇందుకూరుపేట మండలం జేజేపేటకు చెందిన వంశీ, నాలుగోమైలుకి చెందిన ఓ బాలుడిని, మార్పూరు మండలం ఇసుకదర్శికి చెందిన ఎం రామును టాన్స్‌జెండర్లు సంప్రదించారు. హాసినిని అడ్డుతొలగిస్తే రూ.20 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకొని, కొంత నగదు ముందుగానే ఇచ్చారు. దీంతో నిందితులు నెల నుంచి హాసిని కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఆమె పక్కనే ఉండే ఓ హిజ్రాను మచ్చిక చేసుకుని హాసిని కదలికలు తెలుసుకుంటూ వచ్చారు. ఈ నెల 26వ తేదీ హాసిని స్వగ్రామంలోని ఆలయం వద్దకు వెళ్లి వస్తుండగా టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద కాపు కాచి పాశవికంగా హత్యచేసి పరారయ్యారు.

● అతను దొరికితే..

ఈ కేసులో సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు మాత్రం దొరకలేదు. ఆ వ్యక్తి ఈ ఏడాది వినాయక చవితి ఉత్స వాలకు హిజ్రా నాయకురాలు అలేఖ్య సాయంతో కొందరు హిజ్రాలను తెలంగాణ నుంచి పిలిపించి ఇక్కడ కార్యక్రమా లను ఏర్పాటు చేయించారు. మన రాష్ట్రంలో హిజ్రాలు లేరా.. పక్క రాష్ట్రం నుంచి తెప్పించాల్నా.. అంటూ హాసిని అప్పుడు వాళ్లతో గొడవపడి అతడిపై దాడి చేయించిందని, దీంతో అతను పగ పెంచుకొని హత్యకు సుపారీ తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ కేసులో పలు చిక్కుముడులు వీడాల్సి ఉంది. అసలు హాసిని ప్రయాణం చేసిన కారు డ్రైవర్ ఏమయ్యాడు. ఈ కేసులో ఎంతమంది పాత్ర ఉందనే ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది. సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు దొరికితే అన్నీ బయటకు వస్తాయి.

రామదూతపై అభయ ప్రదాత



హనుమంత వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం రాత్రి ఏడు గంటలకు కోదండరాముడి అలంకారంలో పద్మావతీ అమ్మవారు హనుమంత వాహనంపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. వాహన సేవ ప్రారంభం నుంచి ముగిసే వరకు వర్షం పడుతూనే ఉంది.

కల్పవృక్షంపై కల్పవల్లి

ఉదయం చర్నాకోలు, దండం ధరించి రాజమన్నార్ అలంకరణలో కల్పవృక్ష వాహనంపై అమ్మవారు తిరువీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు అమ్మవారిని అద్దాల మండపం నుంచి వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చి, అలంకరించారు. గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా జీయర్ స్వాముల దివ్య ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యం, చిన్నారుల కోలాటం, భజనలు, కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవిందనామస్మరణ నడుమ వర్షపు జల్లుల మధ్య వేడుకగా అమ్మవారికి వాహనసేవ జరిగింది. మధ్యాహ్నం స్నపన తిరుమంజం నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపానికి వేంచేపు చేసి ఊంజల్ సేవ నిర్వహించారు.



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటలకు పల్లకీ ఉత్సవం
- సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం
- రాత్రి 7 గంటలకు గజ వాహనసేవ

చార్టర్ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం



పాకాల చార్టర్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటులో పాల్గొన్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

పాకాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాకాల చార్టర్ లయన్స్‌క్లబ్‌ను ఆదివారం ప్రారంభించారు. దామలచెరువులో ప్రిసైడింగ్ అధికారి మారసాని విజయబాబు అధ్యక్షతన లయన్స్‌క్లబ్ ఆఫ్ పాకాల చార్టర్ ప్రజెంటేషన్ ఘనంగా నిర్వహించారు. డిస్ట్రిక్ట్ 317 గవర్నర్ చంద్ర హెచ్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. అధ్యక్షుడిగా అనీల్ పోతుగుంట, సెక్రటరీగా మారసాని మహేష్ బాబు, ట్రెజరర్‌గా ఎం.నాగేంద్ర, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.ధనుంజయ ప్రమాణ స్వీకారం చేశారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలకు ప్రాధాన్యతనిస్తామన్నారు. అనిల్ పోతుగుంట పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ భక్తవత్సల రెడ్డి, ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అశ్వతనారాయణ స్వామి, గ్లోబల్ ఎక్స్‌టెన్షన్ ఛైర్‌పర్సన్ రాకేష్ సెంధ్వాల్, రీజన్స్ ఛైర్ పర్సన్ రామచంద్ర స్వామిరెడ్డి, గోపీనాథ్, జడ్‌సి సోమయ్య, జీఈటీ మెంబర్ ఎం.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవహిస్తున్న ఏరులు



ప్రవహిస్తున్న గాజులేరు

ఎర్రావారిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో ఏరులు ప్రవహిస్తున్నాయి. ఫెంగల్ తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నా మండలంలోని చెరువులు నిండలేదు. శేషాచలం అడవుల్లో కురుస్తున్న వర్షాలకు తలకోన ఏరు, గాజుల ఏరు, కప్పలేరు ప్రవహిస్తున్నాయి. ఈ మూడు ఏరులతో పాటు ఎల్లమంద ఏటి నీరు వృధాగా పించా నదిలోకి పోతోంది. రైతుల పొలాలకు నీరందించే చెరువులు నిండకుండానే ఏర్లల్లోని నీరంతా అన్నమయ్య జిల్లాలోని పింఛా ప్రాజెక్టులోకి పోతోంది. ఈ విషయాన్ని తలకోన నీటి సాధన కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తలకోన నీరు చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల రైతుల సాగుకు, తాగు నీటికి ఉపయోగపడేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు కేటాయించగానే పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈ ప్రాంత రైతులకు శాశ్వతంగా కరువు నివారణ జరగనుంది.

బైకును ఢీకొన్న కారు : ఒకరి మృతి



గజేంద్ర (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. గంగాధరనెల్లూరు పంచాయతీ మోతరంగనపల్లె గ్రామానికి చెందిన గోవిందమందడి కుమారుడు గజేంద్ర అలియాస్ గజేంద్రయాదవ్ (34) జైన్ ఇరిగేషన్ డ్రిప్ కంపెనీకి సంబంధించి చిత్తూరు షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయలచెరువులోని అత్తగారింటికి శనివారం వెళ్లారు. ఆదివారం ఉదయం అక్కడి నుంచి బైక్‌పై స్వగ్రామం బయల్దేరాడు. నెల్లేపల్లె వద్దకొచ్చేసరికి చిత్తూరు నుంచి పుత్తూరు వైపు వెళుతున్న కారు అదుపుతప్పి బైక్‌పై వస్తున్న గజేంద్రను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలవడంతో 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. గజేంద్ర భార్య తనూజ ఫిర్యాదు మేరకు గంగాధరనెల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగని గజరాజుల విధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన టమాటా పంట

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో గజరాజుల విధ్వంసం కొనసాగుతోంది. వారం రోజుల క్రితం దిగవూరు పంచాయతీలో ప్రారంభమైన విధ్వంసం చిట్టేచర్ల అటవీ ప్రాంతం వరకు వెళ్లిన ఏనుగులు తిరిగి దిగవూరు ప్రాంతానికి వచ్చేశాయి. శనివారం రాత్రి దిగవూరు పంచాయతీ శాంతినగర్‌కు చెందిన కృష్ణయ్య టమోటా తోటను ధ్వంసం చేశాయి. అనంతరం ఎగవూరు గ్రామంలో మామిడి తోటలో ఏనుగులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. తమను ఆదుకోవాలని పంటలు నష్టపోయిన బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

స్థానికులకు ఉచిత దర్శన ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయ నగర్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానికులకు శ్రీవారి ఉచిత దర్శన టోకెన్ల జారీ కోసం మహతి కళాక్షేత్రంలో చేసిన ఏర్పాట్లను టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి టెంపుల్ డిప్యూటీ ఈఓతో కలిసి ఆదివారం రాత్రి పరిశీలించారు. టోకెన్ల జారీ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

తాటికోన మెగాలిత్‌కు ట్రెక్కింగ్



తాటికోన ట్రెక్కింగ్ బృందం

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అడ్వెంచరెస్ అడిక్ట్ బృందం ఫెంగల్ తుఫాన్ హోరులో తాటికోన మెగాలిత్ ప్రాంతానికి ట్రెక్కింగ్ చేసింది. ఈ ప్రాంతానికి మూడువేల సంవత్సరాల చరిత్ర ఉంది. మెగాలిత్ అంటే భారీ రాళ్ల నిర్మాణాలు. క్రీ.పూ 2500 నుంచి క్రీ.శ 40 వరకు గల మధ్య సమయాన్ని మెగాలిత్ కాలంగా భావిస్తారు. వీటిని ఆదిమానవుల సమాధులుగా భావిస్తారు. అలాంటి చారిత్రక నేపథ్యంలో ఉన్న ప్రదేశానికి ట్రెక్కింగ్ చేసింది ఈ బృందం. తుఫాన్ హోరులో ఈ ట్రెక్కింగ్ అనేక వింత అనుభూతులు మిగిల్చిందని బృందంలోని సభ్యులు తెలిపారు. ఈ బృందంలో ఐనేష్ సిద్ధార్థ, గౌతం, ముని, దేవా పాల్గొన్నారు.

పాల ట్యాంకర్ ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



చంద్రగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఐతేపల్లె వద్ద జాతీయ రహదారిలో శనివారం మధ్యాహ్నం పాల ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు సుమారు 50 సంవత్సరాల వయసు గల వ్యక్తి రోడ్డు దాటుతుండగా, చిత్తూరు వైపు వెళ్ళుతున్న పాల ట్యాంకర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి రూ.3.35 కోట్ల ఆదాయం లభించినట్టు ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 73,619 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,112 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.







నృత్య నీరాజనం

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా కళాబృందాలు



తిరుచానూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో అమ్మవారి వాహన సేవల ముందు జడివానలోనూ కళాబృందాలు సమర్పిస్తున్న నృత్య నీరాజనం భక్తజనులకు కనువిందు చేస్తోంది. ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహన సేవలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాలు అద్భుత ప్రదర్శనలిచ్చాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 10 కళా బృందాలు, 238 మంది కళాకారులు పాల్గొని తమ సంగీత నృత్య ప్రదర్శనలతో భక్తులను పరవశింపజేశారు. చిరుజల్లుల మధ్య ఎస్వీ సంగీత నృత్య కళాకారులకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు నవదుర్గల వేషధారణ, కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శించారు. కర్ణాటకకు చెందిన 27 మంది కళాకారులు క్షీరసాగర మథనం, వివిధ పౌరాణిక పాత్రలతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. అదేవిధంగా నెమలి నృత్యం, కుండల నృత్యం, కడప డ్రమ్స్, కోలాటాలు నయనానందకరంగా సాగాయి.

చక్కని తల్లికి చాంగుభళా..!

ఆకట్టుకున్న గరిమెళ్ళ సంగీత నీరాజనం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చక్కని తల్లికి చాంగుభళా.. తన చక్కెర మోవికి చాంగుభళా.. అంటూ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ - బుల్లెమ్మ బృందం నిర్వహించిన సంగీత నీరాజనం అందరినీ ఆకట్టుకుంది. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఆదివారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, హ్యాండ్లూమ్ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.ప్రఖ్యాత సంగీత విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ - బుల్లెమ్మ బృందం అనేక సంకీర్తనలను ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక, ఎకో, బీచ్ టూరిజం అభివృద్ధి ద్వారా జిల్లా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు.ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు మాట్లాడుతూ.. గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ కచేరీల ద్వారా అన్నమాచార్య సంకీర్తనలను విశ్వవ్యాప్తం చేస్తున్నారని కొనియాడారు.ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు,పద్మావతి వర్సిటీ డీన్ కాత్యాయని,కేంద్ర సంగీత, నాటక అకాడమీ ప్రతినిధి రీటా చౌదరి, వెంకటేషన్,నెల్లూరు మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి,టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వచ్చెను అలమేలు మంగ. పచ్చల కడియాల పణతి చెలంగ.. అంటూ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపట్టిన కళా ప్రదర్శనలు ఆద్యంతమూ ఆకట్టుకున్నాయి. హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. తిరుచానూరు ఆస్థాన మండపంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మంగళధ్వని, ఎస్వీ వేద అధ్యయన సంస్థకు చెందిన పండితులచే చతుర్వేద పారాయణం నిర్వహించారు. విజయవాడకు చెందిన డాక్టర్ అళ్వార్ బృందం ధార్మికోపన్యాసం ఇచ్చింది. అనంతరం హైదరాబాదుకు చెందిన మహతి ఆర్ట్స్‌కు చెందిన లక్ష్మి బృందం భక్తి సంగీత కార్యక్రమం చేపట్టింది. ఈ క్రమంలో తిరుపతికి చెందిన విజయకుమారి బృందం హరికథ పారాయణం నిర్వహించింది. సాయంత్రం తిరుపతికి చెందిన రంగనాథ్ బృందం అన్నమయ్య విన్నపాలు, ఊంజల్ సేవలో సేలంకు చెందిన మాళవికా జోషి బృందం అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా గానం చేశారు. మహతి కళా క్షేత్రంలో చెన్నైకి చెందిన గాయత్రి వెంకటేష్ గాత్రం, శైలజా కుమార్ బృందంచే కథాకళి నిర్వహించారు. అన్నమాచార్య కళా మందిరంలో శంకరి నాట్యశాలకు చెందిన భరద్వాజ్ కూచిపూడి నాట్యం ప్రదర్శించారు. రామచంద్ర పుష్కరిణి వద్ద వాయునందన్ బ్రదర్స్ గాత్ర సంగీత ప్రదర్శన నిర్వహించారు. శిల్పారంలో లక్ష్మి బృందం భరతనాట్య ప్రదర్శన చేపట్టారు.

చెంచయ్య నాయుడికే ముక్కంటి సేవా భాగ్యం

● వారం రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశం



శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడుకే శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా అవకాశం వరించనున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ మేరకు ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కార్యాలయం నుంచి అధిష్ఠానం పరిశీలనలో రంగినేని చెంచయ్యనాయుడు ఉన్నట్లుగా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రెండు సార్లు సీఎం చంద్రబాబును రంగినేని చెంచయ్యనాయుడు మర్యాదపూర్వకంగా కలిసిన విషయం తెలిసిందే. 30 ఏళ్ల నుంచి చెంచయ్యనాయుడు బొజ్జల కుటుంబంతో కలిసి నడుస్తున్నారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో రెండు సార్లు శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించి అక్కడ అభివృద్ధిలో తన ముద్ర వేశారు. అడవిని తలపించే మార్కెట్ రోడ్డును సిమెంటు రోడ్డు, సుందరీకరణతో తీర్చిదిద్దారు. అలాగే మార్కెట్ యార్డులో కొత్త గోదాములు, షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించారు. ఆయన హయాంలోనే శ్రీకాళహస్తి పట్టణంలో తొలిసారిగా వారపు సంతను ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయనపై అనేక తప్పుడు ఆరోపణలతో 16కుపైగా కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ పరిశీలించిన సీఎం చంద్రబాబు.. రంగినేని చెంచయ్యనాయుడుకే అవకాశం కల్పించనున్నట్లు, మరో వారంలో ఉత్తర్వులు వెలువడనున్నట్లు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు

తిరుచానూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనసేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. ఇతిహాసాలలో మహర్షులు-ధర్మ ప్రబోధాలు, హనుమంతుడి చరిత్ర, తిరుమల తిరుపతి క్షేత్రమాహాత్మ్యం (కన్నడ), మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కి జీవనీ (హిందీ) వంటి ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, ఉప సంపాదకులు డాక్టర్ నరసింహాచార్య, రచయితలు జి.దామోదరనాయుడు, వావిలికొలను సుబ్బారావు, ఎంజీదేశ్ పాండే, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

4న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపు ఈనెల 4వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద, ఆలయ ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా లెక్కింపులో పాల్గొనాలని ఆదేశించారు.

పదవీ విరమణ సన్మానం



దేవరాజులురెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు

తిరుపతి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల విద్యాశాఖాధికారిగా దేవరాజులురెడ్డి విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని ఎంపీపీ వి.యశోద తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఆదివారం రూరల్ ఎంఈవో-1 దేవరాజులురెడ్డి పదవీ విరమణ సభ నిర్వహించారు. రూరల్ మండల జడ్పీటీసీ రత్నమ్మ, తిరుపతి, పుత్తూరు డీవైఈవోలు బాలాజి, ప్రభాకర్‌రాజు, ఎంపీడీవో రామచంద్ర తదితరులతో కలసి ఆయన్ను సన్మానించారు. సీఎంవో సురేష్, ఎంఈవో-2 శంకరయ్య, హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



శ్రీకాళహస్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శన అలరించింది. బెంగళూరు ఓం శ్రీ పబ్లిక్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని సన్నిహిత ఆలయ ఆవరణలోని బ్రహ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన వేదికపై భరత నాట్యం ప్రదర్శించింది. పలు శివ కీర్తనలకు లయబద్ధంగా చేసిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం ఆలయ అధికారులు సన్నిహితను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని చిన్నగొట్టిగల్లు క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం బొల్లినేనివారిపల్లెలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో చిన్నగొట్టిగల్లు మండలం సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు గ్రామాల ఇన్‌ఛార్జులందరూ శ్రద్ధ తీసుకుని టార్గెట్‌లను పూర్తి చేయాలన్నారు. టీడీపీ నాయకులు బిల్లంకొండ రమణ, జైచంద్రనాయుడు, సురేంద్ర నాయుడు, రాజగోపాల్ నాయుడు, చిట్టిబాబు కాకి వెంకటరమణ, కిశోర్ పాల్గొన్నారు.

ఏటీఎం ధ్వంసం



చంద్రగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కొత్తపేటలో ఇండియన్ బ్యాంక్ ఏటీఎంను మతిస్థిమితంలేని వ్యక్తి ధ్వంసం చేశాడు. బ్యాంక్ అధికారులు, పోలీసులు, స్థానికులు అప్రమత్తం కావడంతో అతను పారిపోయాడు. సదరు వ్యక్తి ఏటీఎం ఉన్న గదిలోకి వెళ్లి అక్కడే ఉన్న బండరాయిని తీసుకుని ఏటీఎం మిషన్ను పగలగొట్టాడు. దీంతో గదిలో సైరన్ మోగడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. విచారించగా అతనికి మతిస్థిమితం లేదని తెలిసింది. బ్యాంక్ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ధ్వంసమైన ఏటీఎం మిషన్ను పరిశీలించారు. సెక్యూరిటీ గార్డును నియమించాలని పోలీసులు బ్యాంకు అధికారులకు సూచించారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యత్తు కమ్యూనిస్టులదే

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆశాభావం



సభలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

సత్యవేడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని కుదిపేస్తున్న సోలార్ కుంభకోణంపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ పెదవి విప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సత్యవేడులో ఆదివారం జరిగిన సీపీఎం తిరుపతి జిల్లా 14వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.డబ్బు, కులం, కుటుంబ పాలన అంశాలు ఈ రోజుల్లో అధికారాన్ని, నాయకులను తయారు చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, కులమతాలతీతంగా నాయకత్వాన్ని ఎంపిక చేస్తున్న పార్టీ సీపీఎం మాత్రమేనన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలు కోరుకుంటున్నారన్న ఆయన భవిష్యత్తు కమ్యూనిస్టులదేనన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ కీలక వ్యక్తికి పారిశ్రామికవేత్త అదానీ నుంచి రూ.1750 కోట్లు ముట్టాయని మీడియా కోడై కూస్తున్నా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఎందుకు విచారణ జరపడంలేదని ప్రశ్నించారు. తాను మోదీ చెప్పినట్లు చేశానని జగన్, మోదీకి చెప్పకుండా తానేమీ చేయడం లేదని చంద్రబాబు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అదానీకి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. మోదీ పాలనలో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు ఎనిమిది నుంచిమూడు శాతానికి పడిపోగా, నిత్యావసర ధరలు మాత్రం ఎనిమిది నుంచి పదహారు శాతానికి పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి కేంద్రం బడ్జెట్‌లో ఒక్క పైసా కూడా కేటాయించలేదని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ శ్రీసిటీ పరిశ్రమల్లో కార్మికులకు సరైన వేతనాలు, పీఎఫ్ సౌకర్యాలు అందడం లేదన్నారు.సాగు నీటి ప్రాజెక్టులు ఆధునికీకరణకు నోచుకోక పడకేసినా పట్టించుకునే నాథుడు లేడని విమర్శించారు.మహాసభల వేదికగా తిరుపతి జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల భవిష్యత్ పోరాటాల తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య, చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, కందారపు మురళి,అంగేరి పుల్లయ్య,రమేష్ సుబ్రమణ్యం, సాయిలక్ష్మీ, జయచంద్ర, హరినాథ్, మాధవ్, వెంకటేష్, అరుణాచలం, శివకుమార్, గంధం మణి, అల్లెయ్య, వేణు, భగత్, గురవయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ రీజనల్ అధ్యక్షుడిగా శేషాద్రి



తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యభవనంలో ఆదివారం ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తిరుపతి రీజియన్ నాల్గో మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కైలాసనాథ్ ఆధ్వర్యంలో కొత్త రీజనల్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.శేషాద్రి, కార్యదర్శిగా ఆర్.సహదేవరాజు, కోశాధికారిగా డి.రమేష్‌ను నియమించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కె.ఆర్.అంజనేయులు, జె.ఎం.ఆర్.నాయుడు, కె.శ్రీనివాసులు, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి తాండాయం సత్యనారాయణ, జిల్లాలోని అన్ని డిపోల నుంచి అధ్యక్షకార్యదర్శులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇండియన్ హ్యూమన్‌రైట్స్ నగర కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ హ్యూమన్ రైట్స్ అండ్ కరప్షన్ సెల్ తిరుపతి నగర కమిటీ ఆదివారం ఎన్నికైంది. ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా కె.కె.రమేష్, జి.శంకర్, పి.మధుసూదన్, సహాయ కార్యదర్శిగా శివరామకృష్ణ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళీమోహన్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. ఇప్పటికే అధ్యక్షుడిని ఎన్నుకున్న విషయం తెలిసిందే.

తిరుపతి రూరల్ విద్యుత్ డివిజన్‌లో రూ.50 లక్షల నష్టం



కత్తెరపల్లి వద్ద పొలాల్లో పడివున్న ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా తిరుపతి రూరల్ డివిజన్ పరిధిలో సుమారు రూ.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆ డివిజన్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం మండలాల్లో పెనుగాలులకు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకు వరిగాయని చెప్పారు. 49 విద్యుత్ స్తంభాలు, 20కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, కేబుల్స్ పాడైనట్లు వివరించారు. సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని చెప్పారు. చెమ్మగిల్లిన విద్యుత్ స్తంభాలను తాకరాదని, నివాసగృహాల్లో స్విచ్‌లు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని వివరించారు. విద్యుత్ సమస్యలు ఎదురైన సమయంలో టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

కపిలేశ్వరాలయంలో ముగిసిన హోమ మహోత్సవాలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల రోజులుగా కపిలేశ్వరాలయంలో నిర్వహిస్తున్న హోమ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం చండికేశ్వరస్వామి హోమం నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, కలశాభిషేకం, త్రిశూల స్నానం, అంకుర విసర్జన నిర్వహించారు. సాయంత్రం లక్ష దీపారాధన, పంచమూర్తులైన విఘ్నేశ్వరస్వామి, వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, చండికేశ్వరస్వామి వారికి ఆరాధన చేపట్టారు. ఆ తర్వాత పంచమూర్తులు పురవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి ఐఎంఏ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న గార్లపాటి నందకిషోర్

తిరుపతి (ఎంఆర్ పల్లె), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఐఎంఏశాఖకు 22వేల మందికిపైగా సభ్యులున్నారన్నారు. 26 జిల్లాల్లో 99 శాఖలు ఉన్నాయని తెలిపారు. ప్రతి జిల్లాలో కనీసం నాలుగు గ్రామాలను దత్తత తీసుకుని అక్కడి ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొన్ని సందర్భాల్లో రోగులు చనిపోతుంటారని, ఆ సమయంలో వారి బంధువులు ఆస్పత్రులపై దాడులు చేయడం సరికాదని తెలిపారు. వీటిని ప్రభుత్వం అరికట్టాలన్నారు. పూర్వ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు మాట్లాడుతూ వైద్యులకు సింగిల్‌విండో విధానం ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సేవకుమార్, శ్యామ్ బాబు, డాక్టర్ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పక ఏఆర్‌టీ మందుల వాడకంతో

ఎయిడ్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చు



ఎయిడ్స్‌పై అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితులు క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే ఏఆర్‌టీ మందులను వాడటం వలన ఆ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాలలోని భువన విజయం ఆడిటోరియంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉన్నప్పుడే దానిని అరికట్టేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, వ్యాధి బారిన పడినవారిని వివక్షతతో చూడరాదన్నారు. ఎయిడ్స్ నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, అందిస్తున్న మందుల గురించి ఆయన వివరించారు. వైద్యాధికారులతో కలిసి ఎయిడ్స్‌పై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు రవిప్రభ, పార్థసారథిరెడ్డి, డీపీఎంవో శ్రీనివాస్, డీఎంవో రూప్‌కుమార్ పాల్గొన్నారు.

విరాళాల కియోస్క్ మిషన్ ప్రారంభం



విరాళంగా అందించిన స్లిప్‌ను చూపుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు విరాళం ఇచ్చేందుకు తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్‌ను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం ప్రారంభించారు. ఈ మిషన్‌ను సౌత్ ఇండియన్ బ్యాంక్ టీటీడీకి విరాళంగా అందించింది. భక్తులు అన్నప్రసాదం ట్రస్టుకు తమకు తోచిన మొత్తాన్ని కియోస్క్ మిషన్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూపీఐ ద్వారా సులభతరంగా విరాళాలు ఇవ్వచ్చు. ఈకార్యక్రమంలో సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో రాజేంద్ర, సౌత్ ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ మోహన్, ఏజీఎం మధు, చీఫ్ మేనేజర్ వెంకటరావు, తిరుపతి బ్రాంచ్ హెడ్ అశోక్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

భర్త పంపిన వాట్సాప్ సమాచారంతో రక్షించిన పోలీసులు



మహిళను రక్షించి తీసుకువస్తున్న మహిళా పోలీసులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భార్యా భర్తల మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి వివాదంతో భర్తపై కోపంతో భార్య ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా, సకాలంలో ఆమె భర్త పోలీసులకు ఇచ్చిన సమాచారంతో పోలీసులు గంటల వ్యవధిలోనే గుర్తించి ఆమె ప్రాణాలు నిలబెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి... వినుకొండకు చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలతో భర్తపై అలిగి ఆదివారం తిరుపతిలోని విష్ణు నివాసానికి చేరుకుంది. అక్కడ నుంచి భర్తకు ఫోన్ చేసి నేను రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడుతున్నానని చెప్పి వెంటనే ఫోన్ కట్ చేసింది. దీంతో వెంటనే ఆమె భర్త అక్కడ నుంచి ఫోన్ ద్వారా మధ్యాహ్నం 2.40 గంటలకు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే స్పందించిన కమాండ్ కంట్రోల్, మహిళా రక్షక్, బ్లూకోట్స్ వంటి బృందాలు ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు భర్త నుంచి మహిళ వివరాలు, ఫొటో సేకరించి విచారణ చేపట్టారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో చివరి ప్లాట్‌ఫారం ట్రాక్ వద్ద మహిళను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను తమ వెంట తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి తొందరపాటు నిర్ణయాలు తీసుకొని ప్రాణాల మీదకు తెచ్చుకోవడం మంచిది కాదని సూచించారు. సకాలంలో స్పందించి మహిళ ఆచూకీ కనిపెట్టి ఆమె ప్రాణాలు నిలబెట్టడంలో చక్కటి ప్రతిభ చూపిన సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించండి



ర్యాలీ నిర్వహిస్తున్న వెలగపూడి ప్రకాష్‌రావు, నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ అధ్యక్షులు వెలగపూడి ప్రకాష్ రావు, శ్రీవారి భక్తుడు నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి నగరంలోని బాలాజీకాలనీ వద్ద గల జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి కృష్ణాపురం ఠాణా వరకు హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించాలంటూ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ బాధ్యత ప్రతి హిందువుపై ఉందని, హిందూ సనాతన బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. టీటీడీలో సమాచారహక్కు చట్టాన్ని తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నివేల కోట్ల రూపాయలు ఇంజనీరింగ్ పనులకు ఖర్చు చేశారు... టీటీడీ బోర్డు అనుమతితో పనులు ప్రారంభించారా... ఏకపక్ష నిర్ణయంతో ఖర్చు చేశారా... అన్నవాటిపై ప్రస్తుత పాలకమండలి శ్వేతపత్రం విడుదల చేసి భక్తుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. తిరుమలలో, అలిపిరి జూపార్కు నుంచి చెర్లోపల్లె వరకు నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లకు ఇరువైపులా తొలగించిన మహావృక్షాలు (శ్రీగంధంచెట్లు) ఎక్కడ ఉన్నాయి అన్నదానిపై టీటీడీ ఛైర్మన్ సమగ్ర విచారణకు ఆదేశిస్తే నమ్మలేని నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. టీటీడీ ఛైర్మన్, ఈవో, అడిషనల్ ఈవోలు అవినీతి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. ఈ ప్రధాన అంశాలపై కూడా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో ఫౌండేషన్ ప్రతినిధులు వెలగపూడి నందినీవేణుగోపాల్, రమాదేవి, జెన్ కిరణ్‌కుమార్, డేగల మహేష్, రెడ్డిశేఖర్, పుష్పసుధ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల వర్ధంతి సందర్భంగా పలువురు కళాభిమానులు ఘనంగా నివాళి అర్పించారు. భవానీ నగర్ సర్కిల్‌లోని ఘంటసాల విగ్రహానికి బీజేపీ నేత గుండాల గోపినాథరెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఘంటసాల భౌతికంగా దూరమైనప్పటికీ పాటల రూపంలో అందరి హృదయాల్లో జీవించే ఉన్నారని చెప్పారు. ఘంటసాల అభిమాని చంద్రారెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళాదీపిక ఎడిటర్ రాఘవాచారి, టీచర్ తిరుమలయ్య, వాసు, సందీప్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

నేడు లక్ష్మీకాసుల హారం శోభాయాత్ర

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జరుగనున్న గజవాహనసేవలో అలంకరించేందుకు తిరుమల శ్రీవారి లక్ష్మీకాసుల హారాన్ని సోమవారం ఉదయం శోభాయాత్రగా తిరుచానూరుకు తీసుకెళ్లనున్నారు. ముందుగా శ్రీవారి ఆలయం నుంచి ఈ హారాన్ని బయటకు తీసుకొచ్చి నాలుగు మాడవీధుల్లో శోభాయత్ర నిర్వహించి తర్వాత తిరుచానూరుకు తీసుకువెళతారు. తిరుచానూరులోని పసుపు మండపం వద్ద హారానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళతారు. ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణగా గర్భాలయానికి తీసుకెళ్లి మూలమూర్తికి లక్ష్మీకాసుల హారాన్ని అలంకరిస్తారు.

చిరిగిన జాతీయ పతాకం తొలగింపు



తిరుపతి అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా వీస్తున్న పెనుగాలులకు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఎత్తైన జాతీయ పతాకం చిరిగిపోయింది. ఈ దృశ్యం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడంతో స్పందించిన నగరపాలక సంస్థ సిబ్బంది ఆదివారం ఉదయం జాతీయ పతాకాన్ని జాగ్రత్తగా కిందకు దించి, భద్రంగా తీసుకెళ్లారు. నూతనంగా జెండాను ఏర్పాటుచేసేందుకు చర్యలు ప్రారంభించారు.

జాతీయ కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్ర



తిరుపతి (లీలామహల్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ కాపు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా సుంకర రాజేంద్రరాయల్‌ను నియమించినట్లు ఆ సంఘ వ్యవస్థాపకుడు కర్ణ మురళీకృష్ణ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ కాపు సంఘ కార్యాలయం నుంచి నియామకపత్రం అందించినట్లు పేర్కొన్నారు.

7 నుంచి పీజీ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీ నుంచి ఎస్వీయూ పరిధిలో పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరీక్షల విభాగం సిద్ధం చేస్తోంది. పరీక్ష కేంద్రాలు, పర్యవేక్షకులకు సంబంధించిన జాబితా రూపొందించారు.

మూడోరోజూ విడవని వర్షం





ఆలయం ముందు కురుస్తున్న వర్షం, గొడుగులు పట్టుకుని వెళుతున్న భక్తులు

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో తిరుమల క్షేత్రంలో మూడో రోజు ఆదివారం కూడా వర్షం కురిసింది. శుక్ర, శనివారాల్లో ఎడతెరిపి లేకుండా పడిన వాన ఆదివారం ఉదయం కాస్త ఉపశమనమిచ్చినా మధ్యాహ్నం 12 గంటల నుంచి తిరిగి మొదలైంది. రాత్రి వరకు దఫాలువారీగా కురిసింది. దర్శనానికి వెళ్లే, వచ్చే భక్తులు వర్షంలో తడుస్తూ, పరుగులు పెడుతూ, వణుకుతూ, అక్కడక్కడ తలదాచుకుంటూ వెళ్లారు. చిన్నారులు, వృద్ధుల ఆగచాట్లు కూడా కొనసాగాయి. తిరుమలలో అక్కడక్కడ పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ చూసినా వర్షపు నీరు, తేమే దర్శనమిస్తోంది. చలి కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో భక్తులు దర్శనం పూర్తికాగానే తిరుమల నుంచి తిరుగు ప్రయాణవుతున్నారు. గదులు లభించని భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, కార్యాలయాలు, షెడ్లలో తలదాచుకుంటున్నారు. ఆదివారం కూడా పాపవినాశనం, శ్రీవారిపాదాల మార్గాలను టీటీడీ మూసివేసింది. దట్టమైన పొగమంచు పలు సందర్భాల్లో తిరుమలను కప్పేసింది.

విరిగిపడిన కొండచరియలు

వరుస వర్షాల నేపథ్యంలో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో పలు చోట్ల స్వల్పంగా కొండచరియలు విరిగిపడ్డాయి. 14, 15వ కిలోమీటర్ల వద్ద కొండచరియలు పడ్డాయి. వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పడిన బండ రాళ్లు, మట్టిని ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. మొదటి, రెండవ ఘాట్‌రోడ్డు, తిరుమలలోని ప్రెస్‌క్లబ్, ఆదిశేష విశ్రాంతి భవనం వద్ద చెట్ల కొమ్మలు నేలకూలాయి. భక్తులు ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

తిరుపతిలో కొంచెం ఇష్టం... కొంచెం కష్టం





తిరుమల గిరి నుంచి మాల్వాడిగుండం, కపిలతీర్థంలోకి జాలువారుతున్న వర్షపునీరు ● శేషాచల కొండలపై మంచు



వర్షంలో బైక్‌లపై యువత

తిరుపతి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో తిరుపతిలో ఒక వైపు వరదనీరు రోడ్లపై పారుతూ ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంటే, మరోవైపు తిరుమల గిరుల పచ్చదనం, కపిలతీర్థం, మాల్వాడిగుండాల జలపాతాల పరవళ్లతో ఆహ్లాదాన్నిస్తోంది. ఆదివారం తిరుపతిలో మధ్యాహ్నం వరకు చిరుజల్లులు పడ్డాయి. రాత్రి 8 గంటలపైన అడపాదడపా వర్షం పడటంతో ప్రయాణీకులు కాస్త ఇబ్బందులు పడ్డారు. వాతావరణం చలిగా, ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ వర్షం పెద్దగా పడలేదు. తిరుమల కొండలతో పాటు ఎగువప్రాంతాల్లో కురిసిన వర్షం నగర రోడ్లపైకి రావడంతో పలుచోట్ల రహదారులు చెరువులను తలపించాయి.

● కపిలతీర్థం కోనేరులో నాగుపాము

తిరుమల గిరులనుంచి మాల్వాడిగుండం, కపిలతీర్థం ద్వారా పెద్దఎత్తున ఉబుకుతున్న జలపాతాలనుంచి ఓ నాగుపాము కపిలతీర్థం కోనేటిలోకి పడింది. స్నానమాచరిస్తున్న భక్తులు భయాందోళనతో గట్టుపైకి చేరుకున్నారు. కొద్దిసేపటికి కాలువమార్గం ద్వారా అది వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కపిలతీర్థ జలపాతాల కింద స్నానాలు, సెల్ఫీలతో భక్తులు సందడి చేశారు.







తిరుచానూరులో వర్షంలో పరుగెత్తుతున్న మహిళలు, ● ఎంఆర్‌పల్లెలో వర్షానికి దెబ్బతిన్న రోడ్డు ● వర్షంలో బైక్‌పై వెళుతున్న కుటుంబం

ఆటోనగర్, పూలవానిగుంట జలమయం



ఆటో నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా ఫెంగల్ తుపానుతో కురుస్తున్న వర్షానికి నగరంలోని పలు ప్రాంతాలు చెరువులు, మడుగులను తలపిస్తున్నాయి. ప్రధానంగా ఆటోనగర్, పూలవానిగుంట, గొల్లవానిగుంట ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, వీధులు పూర్తిగా వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో స్థానికులు ఈ మార్గాన రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిలిచిన నీటిలో చిన్నారులు కేరింతలు కొడుతూ ఆటలాడుకున్నారు. ఆటోనగర్‌లోని రోడ్లు మడుగులను తలపించేలా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు.



జలమయమైన గొల్లవానిగుంట రోడ్డు

వీధి సమస్యను పరిష్కరించండి



రవీంద్రనగర్‌లో గుంతల్లో నిలిచిన నీరు

తిరుపతి అర్బన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 2వ డివిజన్ రవీంద్రానగర్‌లో సీసీరోడ్డు వేస్తామని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బాగున్న వీధిని తవ్వేశారు. స్థానికులు అడ్డుకుంటున్నా లెక్క చేయకుండా ఇంటి గడపల వరకు లోడేశారు. దీంతో ఇంట్లోకి వచ్చేటప్పుడు, బయటకు వెళ్లేటప్పుడు అవస్థలు పడుతున్నారు. ఇదిగో అదిగో అంటూ గత పాలకులు కాలం గడిపేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కూడా ఎన్నికల ప్రచార సమయంలో వీధుల దుస్థితిని గమనించి అధికారంలోకి వచ్చిన వెంటనే సీసీ రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. వచ్చి ఆరునెలలు గడుస్తున్నా కనీసం తొంగిచూడలేదు. ఆయనకు, ఆయన అనుచరుల దృష్టికి ఈ సమస్య పలుమార్లు తెలియజేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు అంటున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు పదేపదే తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వీధిలో నీరు నిల్వ ఏర్పడి రాకపోకలకు తీవ్ర సమస్యగా మారిందని, పిల్లలు, వృద్ధులు నడవలేకున్నారని, రాత్రివేళలో బయటకు వెళ్లాలంటే భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద భరించలేకున్నారు. నగర కమిషనర్ స్పందించి కనీసం వీధిలోని గుంతలైనా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుమల ఘాట్‌లో యువకుల హల్‌చల్

● కారు సన్‌రూఫ్, విండోస్ నుంచి బయటకు వచ్చి కేకలు ● అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఘాట్‌రోడ్డులో రన్నింగ్ కారు పైన యువకులు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో కొంతమంది యువకులు హల్‌చల్ చేసి పోలీసులకు చిక్కారు. హైదరాబాద్‌కు చెందిన ఆ యువకులు రన్నింగ్‌లో ఉన్న కారు సన్‌రూఫ్, విండోస్ నుంచి బయటకు వేలాడుతూ కేకలు వేస్తూ సెల్ఫీలు, వీడియోలు తీసుకున్నారు. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టీటీడీ విజిలెన్స్ స్పందించి సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా ఆ యువకులను తిరుమలలోని నందకం విశ్రాంతి గృహం వద్ద ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. కారులో ఇద్దరు మహిళలు, చిన్నారులు కూడా ఉన్నట్టు తెలిసింది. ఘాట్‌రోడ్డులో కారును వేగంగా నడుపుతూ, ప్రమాదకరంగా వేలాడుతూ సెల్ఫీలు తీసుకోవడంతో పాటు వెనుకవస్తున్న వాహనదారులను ఇబ్బందులకు గురిచేసిన ఆరుగురు యువకులను తిరుమల పోలీసులు అదుపులోకి తీసుకున్నారని టీటీడీ ఓ ప్రకటన ద్వారా తెలిపింది. ప్రమాదకర విన్యాసాలు చేయకూడదని, ధార్మిక క్షేత్రంలో విచ్చలవిడిగా ప్రవర్తించడం పద్ధతికాదని కౌన్సిలింగ్ ఇచ్చినట్టు తెలిపింది. నిబంధనలను అతిక్రమించడంతో వారిపై చర్యలు తీసుకోనున్నట్టు టీటీడీ తెలిపింది.

పుత్తూరు వార్తలు

నిండుతున్న చెరువులు

పుత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఐదు చెరువులు కలుజులు పారుతున్నాయి. మరో 29 చెరువులకు నీరు చేరుతోంది. ఎస్‌బీఆర్ పురం, నేసనూరు, గంగమాంబాపురం, తాయి మాంబాపురం, కెబీఆర్‌పురం చెరువులు నిడినట్లు జలవనరుల శాఖ ఏఈ పరశురామ్‌నాయక్ తెలిపారు. ఎస్‌బీఆర్ పురం చెరువు, నేసనూరు చెరువు కలుజుల నుంచి వచ్చే నీరు నేసనూరు వద్ద అరుణానదిగా మారుతుంది. ఈ అరుణానది పిళ్లారిపట్టు కాజువే వద్ద పొంగి పొరలుతోంది. దీంతో అప్రమత్తమైన మున్సిపల్ అధికారులు కాజువే వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. పుత్తూరు విద్యుత్ డివిజన్ పరిధిలోని పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలో 12 స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్, నాగలాపురం సబ్‌డివిజన్‌లో 35 స్తంభాలు, 5 ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతిన్నాయని డీఈ ఆశీర్వాదం చెప్పారు.

నిండుకుండలా గూలూరు చెరువు

- తూములకు మరమ్మతులు చేపట్టకుంటే ప్రమాదమే



కలుజుపారుతున్న గూలూరు చెరువు



వడమాలపేట కాజ్‌వేపై ప్రవహిస్తున్న నీరు

వడమాలపేట, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): సుమారు 600 పైగా ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గూలూరు చెరువు నిండుకుండులా ఉంది. ఇప్పటికే నిండి ఉన్న చెరువులోకి మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అదనపు జలాలు చేరుతున్నాయి. ఏడేళ్లుగా తూములకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ముంపు పట్టా భూముల్లో పంటలు చేయలేక అవస్థలు పడుతున్నారు. లోతట్టు ప్రాంతంలోని గ్రామం, దళితవాడ, ఆదిఆంధ్రవాడ వాసులు భయం గుప్పిట్లో ఉన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇక మండలంలో 25 చెరువులకు గానూ 18 చెరువులు కలుజులు పారుతున్నాయి. మండలంలో ఆదివారం ఉదయం వరకు 219 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు వడమాలపేట వద్ద కాజ్‌వేపై మూడు అడుగుల మేరకు ప్రవాహం సాగుతోంది. దీంతో వాహనాలు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్తున్నాయి.

అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వర్షబాధిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో ఉన్న లోతట్టు ప్రాంతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను కోరారు. పొంగిపొర్లుతున్న వాగుటు, కాలువలు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు మున్సిపల్ కంట్రోల్ రూంను సంప్రదించాలని కోరారు.

రోడ్లపై ప్రవహించిన వర్షపు నీరు



ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువలో పూడికతీత, చెట్ల తొలగింపు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నిలకడగా వర్షం కురుస్తుండటంతో కాలువల్లో ప్రవహించాల్సిన వర్షపు నీరు రహదారులపై పొంగిపొర్లాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు అడుగు భయటపెట్టలేదు. పరిస్థితిని ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. డీఈ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఈలు ఎక్కడికక్కడ వర్షపు నీటి దారి మళ్లించే చర్యలు చేపట్టారు. కల్యాణపురం, భవానీనగర్, చిన్నరాజకుప్పం తదితర ప్రాంతాల్లో ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువలు తవ్వించారు. చిన్నరాజుకుప్పం వద్ద భారీ చెట్టు కూలి రహదారికి అడ్డుగా పడింది. దాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈసలాపురంలో తలెత్తిన విద్యుత్ సమస్యను ట్రాన్స్‌కో అధికారులు పరిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని. కమిషనర్ మంజునాథ్ గౌడ్ చెప్పారు.

అండర్ బ్రిడ్జిల్లో నిలిచిన నీరు



తడుకు రైల్వే అండర్ బ్రిడ్జి

పుత్తూరు టౌన్: మండల పరిధిలోని పలు రైల్వే అండర్ బ్రిడ్జీల్లో వర్షం నీరు చేరిపోవడంతో ప్రజలు రాకపోకలు ఇబ్బంది పడ్డారు. తుడకు వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వర్షం నీటితో నిండిపోవడంతో ఎగువ, దిగువ గూలూరు, హరిజనవాడ, పొట్టి గుట్ట, శిరుగరాజపాలెం తదితర గ్రామాలకు ప్రజలు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే గాలి వానకు శిరుగురాజపాలెం వద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. పట్టణంలోని షాపువీధిలో జామా మసీదు గోడ కూలిపోయింది.

మృతదేహం బంధువులకు అప్పగింత

శ్రీకాళహస్తి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దారుణహత్యకు గురైన రవి(20) మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శ్రీకాళహస్తి మండలంలోని ఓటుగుంట సెంటర్‌లో రవి సమీప బంధువు ఆర్ముగం కత్తితో నరికి చంపిన విషయం తెలిసిందే. ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీలో శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు రవి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

వాగులో పడి పశువుల కాపరి మృతి

కేవీబీపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి సీకేపురంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రమేష్ (49) పశువుల కాపరి. శనివారం పశువుల కోసం అడవిలోకి వెళ్లిన రమేష్ వాగులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అడవిలోకి వెళ్లిన రమేష్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో చీకటి పడిన తరువాత వెతకగ్గా రమేష్ ఓ వాగులో పడి మృతి చెందినట్లు గుర్తించారు. రమేష్‌కు మూర్ఛవ్యాధి ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. ఆదివారం దహన సంస్కారాలు నిర్వహించారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం చేసినట్లు తెలిపారు.

కాలు జారి పడి...

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ప్రైవేటు పరిశ్రమలో వలస కార్మికుడు మృతి చెందాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సరాజ్(21) రాచగున్నేరిలో ఉన్న ఓ పరిశ్రమలో కార్మికుడు. ఆదివారం విధులకు హాజరయ్యారు. అయితే విధులు నిర్వహిస్తూ మృతి చెందినట్లుగా మృతదేహాన్ని పరిశ్రమ అధికారులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పై అంతస్తు నుంచి కాలుజారి పడినట్లుగా రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మార్చ్యూరీకి తరలించారు. కాగా ఈ పరిశ్రమలో తరచూ కార్మికుల దుర్మరణాలు వెలుగుచూస్తూనే ఉండటంపై పలువురు కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విడవని వాన

- ఉధృతంగా వాగులు, వంకలు
- చెరువులకు జలకళ
- నీటమునిగిన పంట పొలాలు
- పలు గ్రామాలకు ఆగిన రాకపోకలు



నాయుడుపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడికాలువ

కోట, వాకాడు, పెళ్లకూరు, సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, గూడూరు, చిల్లకూరు, వెంకటగిరి టౌన్, బాలాయపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఆదివారం నాడూ వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి తీరం దాటినప్పటికీ మోస్తరు నుంచి జల్లులు పడుతూనే ఉన్నాయి. కోట మండల పరిధిలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లి పాళెం గ్రామాల సమీపంలో ఉన్న సముద్రంలో అలల ఉధృతి తగ్గలేదు. ఆరు రోజులుగా మత్స్యకారులు వేటకు విరామం పలికారు. బకింగ్‌హామ్ కెనాల్ వరదనీటితో నిండుకుండలా ఉండటంతో గిరిజనులు చేపలవేటకు వెళ్లలేదు. గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖినదిలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పోటెత్తింది. స్వర్ణముఖినది చల్లకాలువలోకి వచ్చే క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న కలుజు వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. ● వాకాడు మండలంలోని ముట్టెంబాక, కల్లూరు, రుద్రవరం, తిరుమూరు, సిద్ధిగుంటపాళెం, కొత్తపాళెం, బాలిరెడ్డిపాళెం, గంగన్నపాళెం, కొండూరు గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. బాలిరెడ్డిపాళెం వంతెనపై మూడు అడుగుల మేర వరద ప్రవహించడంతో గ్రామంలోకి నీళ్ల రాకుండా ఇసుక బస్తాలను అడ్డుగా వేశారు. వంతెనకు అటువైపుగా ఉన్న గంగన్నపాళెం వద్ద ఉప సర్పంచు మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వంతెనకు అడ్డంగా మట్టి కట్టలను ఏర్పాటు చేశారు. దిగువ ప్రాంతాలైన గంగన్నపాళెం, జెమిని కొత్తపాళెం, పామాంజి, వాలమేడు, తూపిలిపాళెం, కోట మండలానికి చెందిన పుచ్చలపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పుటేరు, కాలువలు, స్వర్ణముఖి నదుల నుంచి వరదనీరు సముద్రంలోకి చేరడంతో తీరమంతా బురదమయంగా మారింది. తూపిలిపాళెంలో 20 ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ఆయా కుటుంబాలకు పునరావాస కేంద్రంలోకి తరలించారు. స్వర్ణముఖి బ్యారేజీకి వరదనీటి ప్రవాహం పెరగడంతో ఆదివారం 8 గేట్‌లను ఎత్తి నీటిని దిగువకు వదిలామని ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య తెలిపారు. మరో మూడు రోజుల పాటు స్వర్ణముఖి బ్యారేజీకి వరద ప్రవాహం ఉంటుందని, దిగువ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. ● పెళ్లకూరు మండలంలోని కొత్తూరు కొర్రపాటి కుంటకు గండి పడింది. కుంట దిగువన ఉన్న సుమారు 15 ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఇసుక బస్తాలు అడ్డుగా వేసి గండిని పూడ్చారు. చెంబేడు చెరువు కట్ట కుంగింది. ● సూళ్లూరుపేటలో తేలికపాటి జల్లులతో కూడిన వర్షం పడింది. కేవీబీపురంలో కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కాళంగికి అనుసంధామైన నెర్రికాలువ, పాముల, పుచ్చా కాలువలు పొంగి పొలాలు, రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కోటపోలూరు వద్ద పుచ్చాకాలువ ఉధృతి తగ్గకపోవడంతో రాకపోకలు నిలిపివేశారు. పిండిపాలెం వద్ద చిన్నకాలువ పొంగి ప్రవహించడంతో శ్రీధనమల్లికి రాకపోకలు ఆగిపోయాయి. కోటపోలూరు, ఎన్‌వీకండ్రిగ వద్ద పొలాలు నీట మునిగాయి. ● తడ మండలంలో కొద్దిపాటి చిరుజల్లులు మాత్రమే కురిశాయి. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో పాముల కాలువ, కరిపేటి కాలువ ఉప్పొంగగా, చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. మండలంలో సుమారు 400 ఎకరాల వరిపంట నీట మునిగినట్లుగా ప్రాథమిక సమాచారం. కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, చేనిగుంట, వాటంబేడు ప్రాంతాలలో వర్షపునీరు పంట పొలాలను ముంచెత్తింది. వెండ్లూరుపాడు - కాదలూరు మధ్య రోడ్డుపై వర్షపునీరు పెద్ద ఎత్తున పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ● నాయుడుపేట మండలంలో స్వర్ణముఖినది, మామిడికాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీటమునిగాయి. చెరువులు, వాగులు, వంకలు, నదులు జలకళతో తొణికిసలాడుతున్నాయి ● దొరవారిసత్రం మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఉప్పొంగిన వాగులు, వంకలు ఆదివారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టాయి. శనివారం నుంచి ఉధృతంగా ప్రవహించిన కాళంగి నది ఉధృతి తగ్గడంతో తనియాలి వద్ద వంతెనపై రాకపోకలు కొనసాగాయి. అలాగే వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెనపై కూడా ప్రవాహం తగ్గింది. పూలతోట సమీపంలో సూళ్లూరుపేట - కోట ఆర్‌అండ్‌బీ రహదారి ప్రవహిస్తున్న కన్నాకాలువపై వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు సాగాయి. ● గూడూరు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. పైప్రాంతాల నుంచి వస్తున్న వరద పంబలేరు వాగులోకి చేరుతుండడంతో చప్టాపై రాకపోకలను నిలిపివేశారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ చప్టాపై రాకపోకలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మిటాత్మకూరు, సంతదాసుపల్లి, పగడాలపల్లి, విందూరు తదితర గ్రామాల్లో నారుమళ్లు నీట మునిగాయి. సుమారు 600 ఎకరాలకు పైగా నారుమళ్లు నీటి మునిగి వుంటాయని అంచనా వేస్తున్నారు. అలాగే 40 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిందని రైతులు చెబుతున్నారు. చెన్నూరులో రామలింగయ్య కాలనీ, జగనన్న కాలనీల్లోకి వర్షపునీరు చేరుకోవడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. టీడీపీ నాయకులు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తోడేటి శివకుమార్ ఎక్స్‌కవేటర్ సాయంతో నీటిని తొలగించారు. ● చిల్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లలోకి వర్షనీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. మండల కేంద్రమైన చిల్లకూరులోనూ పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరి సామగ్రి నీట మునిగింది. ● వెంకటగిరి మండలంలో అన్ని చెరువులు సగం వరకు నిండాయి. వెలుగొండ అడవుల్లో నుంచి వచ్చే వర్షపు నీటితో కైవల్యానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ● బాలాయపల్లి మండలంలో కైవల్యానది చప్టాపై వరద ప్రవాహం పెరగడంతో నిండలి, వాఖ్యం, దగ్గవోలు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు ఉధృతంగా సాగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీసుల సిబ్బంది పహారా కాశారు.



వాకాడు: తూపిలిపాళెం తీరంలో ఎగిసిపడుతున్న అలలు



దొరవారిసత్రం: తనియాలి వద్ద కాళంగి వంతెనపై వరద ప్రవాహం






వాకాడు: తూపిలిపాళెం పునరావాస కేంద్రంలో వసతుల గురించి తెలుసుకుంటున్న రెవెన్యూ అధికారులు - గూడూరు: మిటాత్మకూరులో నీటమునిగిన నారుమళ్లు - సూళ్లూరుపేట: వరదనీటిలో వరిపంట - పెళ్లకూరు: కొత్తూరు కొర్రపాటి కుంటకు గండి

బ్యాటరీల రీసైక్లింగ్ అవకాశాల పరిశీలన

నిప్పో పరిశ్రమ హెడ్ నాగరాజు



ఓబుల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నిప్పో ఉద్యోగులు

తడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీలను రీసైక్లింగ్ చేసి మళ్లీ వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నామని నిప్పో పరిశ్రమ హెడ్ డి.నాగరాజు వెల్లడించారు. నిప్పో పరిశ్రమ వ్యవస్థాపకుడు పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి 99వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఫౌండర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి మొట్టమొదటగా అడుగులు వేసి వ్యక్తి ఓబుల్‌రెడ్డి అని కొనియాడారు. 44 ఏళ్ల నిప్పో ప్రస్థానంలో ప్రస్తుతం రూ.500 కోట్ల టర్నోవర్ నమోదు చేశామని, రాబోయే ఐదేళ్లల్లో రూ.1000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పాడై పోయిన బ్యాటరీలను రీసైక్లింగ్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా మని, త్వరలోనే ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో బ్యాటరీలను రీసైక్లింగ్‌కు పూనుకున్నామని తెలిపారు. అనంతరం కార్మికులు, ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఆటలపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ఏజీఎం పి.నాగరాజు, హెచ్‌ఆర్ రమేష్, షణ్ముగమణి, శంకర్‌బాబు, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర కలశపూజ



కలశాలను ప్రదర్శనగా తీసుకెళ్తున్న భక్తులు

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అష్టోత్తర కలశ స్నపన పూజ వైభవంగా చేశారు. ఆలయం ముందు 108 కలశాలలో ద్రవ్యాలను నింపి కలశ స్నపన పూజ చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎన్.కృష్ణమూర్తి, ఆలయ అర్చకుడు సునీల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి అయ్యప్పస్వామి పూజోత్సవం

నాయుడుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి జ్యోతి పూజోత్సవం వచ్చేనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కామిరెడ్డి రాజారెడ్డి తెలిపారు. 3, 4 తేదీల్లో జరగాల్సిన జ్యోతి పూజోత్సవం, అఖండ కర్పూరజ్యోతి మహోత్సవాలు తుఫాన్ కారణంగా వాయిదా వేశామని, భక్తులు గమనించాలని కోరారు.

వసతిగృహ పరిశీలన

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాసాగార్డెన్‌లో ఉన్న బాలికల వసతిగృహాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ ఆదివారం పరిశీలించారు. అక్కడ బాలికలకు అందుతున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. బాలికలను భోజన నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు.

కుంగిన లారీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీ రోడ్డులో ఓ సిమెంటు లారీ కుంగింది. బత్తెయ్య నాయుడు ఆస్పత్రి వద్ద ఆదివారం సాయంత్రం ఓ లారీ రోడ్డు పక్కన కుంగిపోయింది. రద్దీ వేళలో భారీ వాహనం పట్టణ నడిబొడ్డున నిలిచిపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. పక్కనే ఆర్టీసీ బస్టాండు ఉండటంతో కాసేపు అంతరాయం ఏర్పడింది. వాహనం నుంచి లోడును కాసేపటికి దించివేయడంతో ప్రమాదం తప్పింది.



మోటారు సైకిల్ అదుపుతప్పి ఇద్దరు యువకులకు గాయాలు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బ్రిడ్జి సమీపంలో మోటరు సైకిల్ అదుపుతప్పిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గొట్టిప్రోలు గ్రామానికి చెందిన మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం మాంబట్టులోని ఓ కర్మాగారంలో పని చేస్తారు. ఆదివారం విధులు ముగించుకొని మోటరు సైకిల్‌పై నాయుడుపేటకు వెళ్తుండగా బ్రిడ్జి సమీపంలో అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో మల్లికార్జున్, సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరరాఘవస్వామి ఆలయంలో అమావాస్య పూజలు



ప్రత్యేక పుష్పాలంకరణలో వీరరాఘవస్వామి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం చలివేంద్రం వద్ద వెలసిన వైద్య వీరరాఘవులస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

బాధితులను ఆదుకుంటాం

వరదయ్యపాళెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాను బాధితులను ఆదుకుంటామని తహసీల్దారు రాజశేఖర్ చెప్పారు. ఆదివారం ఆయన కంచరపాళెం ఎస్టీకాలనీలో పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలకు, కూలిన ఇళ్లపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బీజీఆర్ కాలనీవాసులకు, అదే విధంగా చిన్నపాండూరు షికారీలకు ఆర్‌బీకేలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు.

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ మహ మ్మారిని తరిమికొట్టగలమని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యాధి కారి రమేష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ఐసీటీసీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ భారతి పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదికి జలకళ



కప్పగుంటకండ్రిగ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది

పెళ్లకూరు, డిశంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణముఖి నది జలకళ సంతరించుకుంది. మండలంలో ముమ్మారెడ్డిగుంట గ్రామం నుంచి పుల్లూరు, కలవకూరు, పెళ్లకూరు మీదుగా తాళ్వాయిపాడు వరకు సుమారు 20 కిలోమీటర్లు విస్తరించిన స్వర్ణముఖి నది అనేక గ్రామాలకు ప్రధాన సాగు, తాగునీటి వనరుగా ఉంది. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో స్వర్ణముఖినది పరవళ్లు తొక్కుతోంది. చెరువులు నిండడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి పంటల సాగుకు ఇబ్బందులు తొలగిపోయతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు,

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బాలిరెడ్డిపాళెం వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

వాకాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎగువున కురిసిన వర్షాలకు స్వర్ణముఖినదిలోకి వరద ప్రవాహం వస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన సూచించారు. ఆదివారం రాత్రి 9 గంటలకు జోరువానలో బాలిరెడ్డిపాళెం గ్రామస్తులతో కలిసి సబ్ కలెక్టర్ స్వర్ణముఖినది వరదనీటి ప్రవాహానికి అడ్డుగా వేసిన ఇసుక బస్తాలను పరిశీలించారు. గతేడాది మిచౌంగ్ తుఫాన్‌తో నష్టం పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. వరద ప్రవాహం నేటి నుంచి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, ప్రజలు అధైర్యపడ్డవద్దని సూచించారు. అయన వెంట తహసీల్దారు రామయ్య, డీటీ సందీప్, ఆర్‌ఐ అఖిల్, ఇరిగేషన్ ఏఈలు కృష్ణయ్య, శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెరువులను పరిశీలించిన అధికారులు



కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 44 చెరువులను తహసీల్దారు జయ జయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, పలువురు వీఆర్వోలు పరిశీలించారు. ప్రస్తుత వర్షాలకు 30 చెరువుల వరకు పూర్తిగా నిండినట్లు గుర్తించారు. అదేవిధంగా పలు చెరువుల తూములకు గండ్లు పడ కుండా తాత్కలిక మరమ్మతులు, రింగ్‌బండ్‌లు వేయాలని ఇరిగేషన్ అధికారులకు తహసీల్దారు సూచించారు. అలాగే చిట్టేడు, చంద్రశేఖరపురం, గోవింద పల్లి, ఉత్తమనెల్లూరు, కోట చెరువులను అధికారులు పరిశీలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

రేణిగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు.ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డు దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ఆచూకీ కోసం విచారించినా ఎటువంటి వివరాలు తెలియరాలేదు. ఆ మేరకు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెంచయ్యనాయుడికే ముక్కంటి సేవా భాగ్యం

● వారం రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశం



శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీ డీ పీ సీనియర్ నేత రంగినేని చెంచయ్యనాయుడికే శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా అవకాశం వరించనున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ మేరకు ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కార్యాలయం నుంచి అధిష్ఠానం పరిశీలనలో చెంచయ్య ఉన్నట్లుగా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రెండుసార్లు సీఎం చంద్రబాబును చెంచయ్యనాయుడు మర్యాదపూర్వకంగా కలిసిన విషయం తెలిసిందే. 30 ఏళ్ల నుంచి చెంచయ్యనాయుడు బొజ్జల కుటుంబంతో కలిసి నడుస్తున్నారు. 2014-19 మధ్య రెండు సార్లు శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించి అక్కడ అభివృద్ధిలో తన ముద్ర వేశారు. అడవిని తలపించే మార్కెట్ రోడ్డును సిమెంటు రోడ్లు, సుందరీకరణతో తీర్చిదిద్దారు. అలాగే మార్కెట్ యార్డులో కొత్త గోదాములు, షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించారు. ఆయన హయాంలోనే శ్రీకాళహస్తి పట్టణంలో తొలిసారిగా వారపు సంతను ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయనపై అనేక తప్పుడు ఆరోపణలతో 16కుపైగా కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ పరిశీలించిన సీఎం చంద్రబాబు... రంగినేని చెంచయ్యనాయుడుకే అవకాశం కల్పించనున్నట్లు, మరో వారంలో ఉత్తర్వులు వెలువడనున్నట్లు పేర్కొన్నారు.

ముక్కంటి ఆలయంలో వైసీపీ హవా!

స్థానిక భక్తుడి ఆవేదన

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇప్పటికీ వైసీపీకి అనుకూల సిబ్బంది భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తూ హవా సాగిస్తున్నారని టీడీపీ నాయకుడు గుడ్లూరు ప్రసాద్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. అదివారం ముక్కంటి ఆలయంలో కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై ఆయన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ... 2004నుంచి 2019వ సంవత్సరం వరకు తాను ప్రతిరోజు వేకువజామున టిక్కెట్టు కొనుగోలు చేసి గోపూజ సమయంలో ఆలయాన్ని దర్శించుకునే వాడినని తెలిపారు. ఆ తరువాత వైసీపీ పాలనతో ఆలయంలో అనుసరించే విధానాలు నచ్చక టీడీపీ అధికారంలోకి వచ్చే వరకు ముక్కంటి దర్శనానికి వెళ్లలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనా ఆలయంలో మార్పులు జరగలేదన్నారు. ఐదేళ్ల నుంచి ఆలయంలో తిష్ఠ వేసుకున్న చాలామంది వైసీపీ సానుభూతిపరులు ఇంకా దర్జాగా కొనసాగుతున్నారన్నారు. ఈవో బాపిరెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో శిలాఫలకాల ధ్వంసం



శనివారం రాత్రి ధ్వంసమైన శిలాఫలకం



గత నెలలో ధ్వంసమైన శిలాఫలకం ముక్క

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మరో మారు గుర్తు తెలియని వ్యక్తులు రెండు శిలాఫలకాల్ని ధ్వంసం చేయడానికి యత్నించారు. గత నెల 15న మండల పరిషత్ కార్యాలయ భవన ఆధునికీకరణ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి ఎత్తుకెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలో ఇదే కార్యాలయంలో ఉన్న మరో రెండు శిలాఫలకాల్ని శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. గతంలో ఎత్తికెళ్లిన శిలాఫలకం పెచ్చు ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఇసుకలో బయట పడింది. కార్యాలయాలకు వాచ్‌మెన్ లేకపోవడం, సీసీ కెమెరాలు అమర్చకపోవడంతోనే దుండగులు బరి తెగిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు.

ఏకలవ్య గురుకులంలో 3 గంటలకు మధ్యాహ్న భోజనం

● ఆగ్రహం వ్యక్తం చేసిన తహసీల్దార్



భోజనాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్న భోజనాన్ని 3 గంటలకు పెట్టడంపై తహసీల్దార్ సుబ్రమణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం సమయానికి పెట్టడం లేదని తహసీల్దార్‌కు ఫిర్యాదు రావడంతో ఆయన పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులను ఆరా తీశారు. ఆలస్యంగా భోజనం పెట్టడంపై ప్రిన్సిపాల్, వార్డెన్ నిలదీశారు. దీనిపై ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్ మాట్లాడుతూ బియ్యం లోడ్ ఆలస్యంగా రావడంతో పాటూ మధ్యాహ్న భోజన నిర్వాహకులే బస్తాలు దించుకోవడం కారణంగా వంట చేయడం ఆలస్యమైందన్నారు. విద్యార్థులకు సమయానికి భోజనాలు పెట్టకపోతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు.

రక్తదానం చేద్దాం ప్రాణాలను కాపాడుదాం



శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుదాం అని యువతరం సేవా సమితి సభ్యులు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు వందమంది రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ తిరుపతి రుయా ఆస్పత్రిలో రక్తనిధిలో రక్తం నిల్వలు అడుగంటాయన్నారు. దీంతో గర్భిణులు, చిన్నపిల్లలు తదితరులు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో శిబిరం నిర్వహించామన్నారు.

బత్తలవల్లంలో కుంగిన బావి





వరదయ్యపాళెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లం గిరిజనకాలనీలో ఉన్న బావి కుంగింది. దశాబ్దాలుగా ఈ బావి గ్రామస్తుల దాహార్తిని తీరుస్తోంది. రోడ్డు పక్కనే బావి ఉండటంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా గ్రామస్తులు కంపలను వేశారు.

రైతాంగాన్ని ఆదుకోండి: సీపీఐ

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య కోరారు. భారీ వర్షాలు, ఈదురుగాలులతో శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు నియోజకవర్గంలో వరి, ఇతర పంటలు నీట మునిగాయన్నారు. అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలన్నారు. అదే విధంగా ఇళ్లు చాలా చోట్ల దెబ్బతిన్నాయని వాటికి అయ్యే ఖర్చును బాధితులకు ఇవ్వాలన్నారు. కొత్తగా పంటలు వేసుకోవడానికి విత్తనాలు, ఎరువులు వెంటనే ఇవ్వాలన్నారు. సహకార సంఘాల ద్వారా రుణాలు పొందిన రైతులకు మాఫీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ పెట్టుబడి రూ.20వేలును వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. తడిసిన ధ్యాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ కూలీలకు 25 కిలోల బియ్యం ఇవ్వాలని కోరారు.

నీట మునిగిన పొలాల పరిశీలన



శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తొట్టంబేడు మండలంలో నీట మునిగిన పొలాలను ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు పరిశీలించారు. పలు గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పంట నష్టాన్ని ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో గుడిసెలు కూలడంతో వాటిని సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో నివేదిక రూపొందించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

నేడు నాగలాపురం మండల మీట్

సత్యవేడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం మీట్ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఎంపీపీ సింధు అధ్యక్షతన ఈనెల 2న సోమవారం జరగనుందని ఎంపీడీవో బాలాజీనాయక్ తెలిపారు. మండల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

అదానీ కుంభకోణంపై మోదీ పెదవి విప్పాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సత్యవేడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని కుదిపేస్తున్న సోలార్ కుంభకోణంపై ప్రధాని నరేంద్రమోదీ పెదవి విప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సత్యవేడులో ఆదివారం జరిగిన సీపీఎం జిల్లా 14వ సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం కేంద్ర కమిటీ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించి సభలను ప్రారంభించారు. పట్టణంలోని వీఎంకే కల్యాణ మండపంలో జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ డబ్బు, కులం, కుటుంబ పాలన ఈ రోజుల్లో నాయకులను తయారు చేస్తున్నాయన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారని, భవిష్యత్తు కమ్యూనిస్టులదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో సోలార్ విద్యుత్ ఒప్పందంలో ఓ కీలక వ్యక్తికి రూ.1700 కోట్లు ముట్టాయని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తున్నా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఎందుకు విచారణ జరపడంలేదని ప్రశ్నించారు. తాను మోదీ చెప్పినట్లు చేశానని జగన్, మోదీకి చెప్పకుండా తానేమీ చేయడం లేదని చంద్రబాబు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అదానీకి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. మోదీ పాలనలో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు ఎనిమిది నుంచిమూడు శాతానికి పడిపోగా, నిత్యావసర ధరలు పదహారు శాతానికి పెరిగాయన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటికి రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.16వేల కోట్ల భారం మోపిందన్నారు. డిసెంబరు 1 నుంచి ట్రూ అప్‌చార్జీల వడ్డన ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ... వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి కేంద్రం బడ్జెట్‌లో ఒక్కపైసా కూడా కేటాయించలేదని మండి పడ్డారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గం విద్య, వైద్యం, వ్యవసాయ పరంగా ఎంతో వెనుకబడి ఉందన్నారు. శ్రీసిటీ సెజ్‌లోని పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు సరైన వేతనాలు, పీఎఫ్ సౌకర్యాలు అందడం లేదన్నారు. మహాసభల వేదికగా తిరుపతి జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల భవిష్యత్ పోరాటాల తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. సభలకు జిల్లా నలుమూలల నుంచి నాయకులు తరలిరావడంతో పట్టణం ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కరయ్య, కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, నాయకులు రమేష్ సుబ్రమణ్యం, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

4న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపు ఈనెల 4వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద, ఆలయ ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా లెక్కింపులో పాల్గొనాలని ఆదేశించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



సన్నిహిత నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శన అలరించింది. బెంగళూరు ఓం శ్రీ పబ్లిక్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని సన్నిహిత ఆలయ ఆవరణలోని బ్రహ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన వేదికపై భరత నాట్యం ప్రదర్శించింది. పలు శివ కీర్తనలకు లయబద్ధంగా చేసిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం ఆలయ అధికారులు సన్నిహితను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

విడవని వర్షం



పారుతున్న సదాశివకోన రిజర్వాయర్



జలమయమైన సత్యవేడు - ఊత్తుకోట రోడ్డు





జయలక్ష్మీపురంలో ఇళ్లలోకి వచ్చిన నీరు - పూడిగ్రామాలకు వెళ్లే మట్టివంతెన కొట్టుకుపోవడంతో ప్రవహిస్తున్న నీరు



చిట్టత్తూరు వద్ద కాలువ ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్ఐ ఈశ్వరయ్య

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం విడిచి విడిచి జల్లులు కురిశాయి. తొట్టంబేడు మండలం చిట్టత్తూరు వద్ద కాలువ పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ ఈశ్వరయ్య అక్కడకు చేరుకుని రాకపోకలను మళ్లించారు.

పూడి గ్రామాలకు తెగిన సంబంధాలు

కేవీబీపురం: మండలంలోని రాజులకండ్రిగ వద్ద పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన కొట్టుకుపోవడంతో పూడి గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాడిరైతుల రోజుకు 500 లీటర్ల పాలను తరలిస్తుంటారు. ప్రస్తుతం మార్గం లేకపోవడంతో నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడి గ్రామానికి వెళ్లడానికి మరో మార్గం లేకపోవడంతో పాల రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇక కోవనూరు కాజ్‌వేపై నీరు ప్రవహిస్తోంది. శ్రీకాళహస్తి - పిచ్చాటూరు ప్రధాన రహదారిపై వాహనాలు తిరగడం లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తిమ్మసముద్రం కాలువ పొంగుతోంది

జయలక్ష్మీపురంలో ఇళ్లలోకి నీరు

మండలానికి అతిచివరి గ్రామమైన జయలక్ష్మీపురం లోతట్టు ప్రాంతం. కాళంగి గేట్లు ఎత్తడంతో యేరు పొంగి గ్రామానికి వెళ్లే దారి లేకుండా నీరు ప్రవహిస్తున్నాయి. దీంతో పాటు గ్రామంలో సుమారు 50 ఇళ్లలోకి నీరు ప్రవేశించింది. దీనికితోడు ఆదివారం కూడా వర్షం పడటంతో నీరు ఇంకా ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి మునిగిన వరి

బుచ్చినాయుడుకండ్రిగ: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మండల వాసులు ఇబ్బంది పడుతున్నారు. రబీలో వేసిన వరి నీట మునగడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో కాటూరు యేరు ఉధృతంగా పారుతుండడంతో తహనగర్, పూసలపల్లి, బంగ్లాతోట, చిన్నాయ్యగుంట, జంబుగోళం తదితర గ్రామాల్లోకి నీరు వచ్చే అవకాశాలు ఉండటంతో తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎస్ఐ విశ్వనాథ నాయుడు ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షాలతో శ్రీకాళహస్తి - తడ రోడ్డు దెబ్బతినింది. కేటి రోడ్డుకు ఇరువైపుల పైపులైను కోసం వేసిన గుంతల కారణంగా రాకపోకులకు అంతరాయం కలుగుతోంది. బీఎస్‌కండ్రిగ అరుంధతి వాడుకు వెళ్లే దారి నీటితో నిండి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సదాశివకోన రిజర్వాయర్‌కు జలకళ

ఏర్పేడు: మండలంలోని చెల్లూరు పంచాయతీలో ఉన్న సదాశివకోన రిజర్వాయర్ జలకళ సంతరించుకుంది. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి రిజర్వాయర్‌కు పూర్తిస్థాయిలో నీరు చేరింది. ఈ రిజార్వాయర్ నుంచి సుమారు 14 వేల ఏకరాలకు సాగు నీరు అందుతుంది. సదాశివకోన రిజర్వాయర్ నుంచి కలుజు పారడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.






కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో వరద ఉధృతిని పరిశీలిస్తున్న బీఎన్‌కండ్రిగ తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎస్ఐ విశ్వనాథ నాయుడు

కదిలిన వాగులు వంకలు

మండలంలో పలు వాగులు, వంకలు కదిలాయి. దీంతో చెరువుల్లోకి నీరు చేరాయి. మండలంలో మునలిపేడు, ఏర్పేడు, మేర్లపాక, చిందేపల్లి చెరువులు పెద్దవి. మునలిపేడు చెరువులోకి నీరు ఉధృతంగా చేరుతోంది. నీరు చేరుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెన్నంపల్లికి చేరుకోవాలంటే స్వర్ణముఖి నదితో పాటు నక్కల వాగు దాటాల్సి ఉంది. అయితే ఈ వాగు ఉధృతంగా ప్రవహించడంతో చెన్నంపల్లె వెళ్లే మట్టిరోడ్డు కోతకు గురైంది. ఈ క్రమంలో గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బంది మారింది.



దుముకుతున్న కైలాసనాథ కోన



ఉధృతంగా తుంబూరు కాజ్ వే

ఆదివారం సాయంత్రం నుంచి గ్రామస్తులు ఆ దారిలో రాలేకపోతున్నారు.

ఉధృతంగా కైలాసకోన

నారాయణవనం: అరుణానది ఉధృతంగా ఉండడంతో మండలంలోని తిరువట్యం, సముదాయం, తుంబూరు, పాలమంగళం గ్రామాల కాజ్‌వేలపై వర్షం కారణంగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తిరువట్యం కాజ్‌వేను పరిశీలించారు. అలాగే కైలాసనాథ కోనలో జలపాతం ఉధృతంగా ఉండడంతో ఆలయ అధికారులు జలపాతం వద్దకి ఎవరినీ అనుమంతిచడం లేదు. మండలంలో వేరుశనగ నీట మునిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సత్యవేడు: మండలంలో ఆదివారం కూడా వర్షం కురిసింది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు జలమయ్యాయి. ప్రధానంగా సత్యవేడు - నాగలాపురం వయా టీపీకోట రోడ్డు గుంతలు తేలి జలమయంకావడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఉలవచేను, బాలుర గురుకుల పాఠశాల, ఇంద్రానగర్, పేరడం తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడం వల్ల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి మరమ్మతులు నిర్వహించి సరఫరాను పునరుద్ధరించారు. కొల్లడం, డీవీఅగ్రహారం, పీవీపురం, కన్నవరం గ్రామాల్లో చెరువులు జలకళ సంతరించుకున్నాయి.

మగ్గం గుంతల్లోకి నీరు



వరదయ్యపాళెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మగ్గం గుంతల్లో నీరు చేరాయి. భారీ వర్షాలతో నష్టపోయిన తమను ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరారు. ఈ మేరకు ఆదివారం తహసీల్దారు రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ముడిసరుకు తేమకు నాని నష్టం వాటిల్లిందని తెలిపారు. మగ్గం గుంతల్లో నీరు చేరిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

దక్షిణకైలాస్‌నగర్ కాలనీలో నడవ తరమా



శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూడండి. పట్టణంలోని ప్రముఖ ప్రాంతమైన దక్షిణ కైలాసనగర్ కాలనీలో దుస్థితికి చేరుకున్న రోడ్డు. కాలనీలో సుమారు వెయ్యికిపైగా గృహాలున్నాయి. కాలనీ నుంచి కొత్త బైపాస్‌కు లింకురోడ్డు ఉండటంతో ఈ మార్గంలో పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇక్కడ సిమెంటు రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో వర్షం పడితే రోడ్డు మడుగుగా మారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మోక్షం కలిగించాల్సి ఉంది.



కుప్పకూలిన సెల్ టవర్

తప్పిన ప్రమాదం

శ్రీకాళహస్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తుఫాన్ కారణంగా వీచిన గాలులకు ఉపయోగంలో లేని సెల్ టవర్ కుప్పకూలింది. భాస్కరపేట పట్టణ ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఉన్న టవర్ చాలా రోజులుగా నిరుపయోగంగా ఉంది. సెల్ టవర్ కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. టవర్ ఇంటిపై పడటంతో గోడలు దెబ్బతిన్నాయి. సచివాలయ సిబ్బందికి స్థానికులు తెలిపినా పట్టించుకోలేదు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.